తూకంలో కోతవిధిస్తే చర్యలు తప్పవు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

మర్కూక్: చెబర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

మర్కూక్, నవంబర్ 4 : ధాన్యం తూకాల్లో కోతవిధిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెబర్తి, వరదరాజ్‌పూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో నాగేందర్, నాయకులు రామ చంద్రం,బాల్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సిద్దిపేట, నవంబర్ 4 : రైతులను ఇబ్బందులు లేకుండా వడ్లను కొనుగోలు కేంద్రాల్లో వేగంగా కొనుగోళ్లు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లారపు తిరుపతి రెడ్డి కోరారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు వామ పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రైతు సంఘం వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 20 రోజులు గడిచినా వడ్లు ఎక్కడ తూకం వేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరుపాలని కోరారు. కత్తుల భాస్కర్‌రెడ్డి, కత్తుల నర్సింహారెడ్డి, పొన్నబోయిన సిద్ధు, లింగ య్య, పోచయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేర్యాల, నవంబర్ 4 : పట్టణ శివారు వాసవీ కాటన్ ఇండస్ట్రీస్‌లో భారత ప్రభుత్వ సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరిపే (సీసీఐ) కేంద్రాన్ని సంబంధిత శాఖ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎం ప్రసాద్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తి క్వింటాల్‌కు రూ.7521 నుంచి 7220 వరకు ధర ఉంటుందన్నారు.రైతులు తమ ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌తో అనుసంధానం ఉన్న మొబైల్ నెంబర్‌ను పత్తి విక్రయ కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. తేమ శాతం 12 దాటితే సీసీఐ కొనుగోలు చేయదని సీసీఐ అధికారి అమిత్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి, చేర్యాల ఏఎంసీ చైర్మన్ నల్లనాగుల శ్వేత, వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి,కార్యదర్శి పరమేశ్వర్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్ రూరల్, నవంబర్ 4: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహ్మదాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పరుశరాములు, నాయకులు కొమ్మెర నర్సింహారెడ్డి, ఎల్లయ్య ఉన్నారు.

కొండపాకలో..

కొండపాక, నవంబర్ 4 : మండల కేంద్రం కొండపాకలోని స్వాతి జిన్నింగ్ మిల్స్‌లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ప్రారంభించారు. అనంతరం కొనుగోళ్లకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యవసాయం, మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ ఉపసంయుక్త సంచాలకులు ప్రసాద్‌రావు, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి సాయిచంద్, మార్కెటింగ్ కమిటీ సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనగోలు జరగడం లేదు..

చేర్యాల, నవంబర్ 4: రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని, రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకుంటున్నారని ప్రకటనలు చేస్తున్న సీఎం నుంచి మంత్రుల వరకు కాంగ్రెస్ గ్రూపుల్లో ధాన్యం కొనుగోలు జరగడం లేదని ఆ పార్టీ కార్యకర్తలే పోస్టులు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఏకంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారు. కొమురవెల్లి మండలంలో 'మన కాంగ్రెస్–మన మండలం' అనే గ్రూపులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకరు పెట్టిన పోస్టింగ్ ఆసక్తి కలిగిస్తున్నది.' నా ప్రియమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి శ్రేయోభిలాషులకు, నాయకులు తెలియజేయనది ఏమనగా, 6 నెలలు కష్టపడ్డ వారి ధాన్యాన్ని ఇంత వరకు కొనుగోలు చేయడం లేదు.ప్రతిపక్ష పార్టీ వాళ్లు ఎగతాళి చేయడం .. ఇదేనా మీ ప్రభుత్వం అనడం జరుగుతుంది. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మడం , ప్రభుత్వానికి మన కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు రైతుల గోస చెప్పడం నా విజ్ఞప్తి. జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్ అని పోస్టు చేశాడు. అంతకు ముందు పెట్టిన పోస్టులో మనధాన్యాన్ని దళారులకు అమ్మడం జరుగుతుంది. రైతులకు ఏం మేలు చేస్తుంది అనడం చాలా సిగ్గుచేటు.. చాలా బాధకరం మన అభిమానులకు ఉంది' అని గ్రూపులో పోస్టు చేశాడు. మొదట చేసిన పోస్టును వెంటనే సదరు వ్యక్తి డిలీట్ చేసి అదే పోస్టును కొంత మార్చి మరో పోస్టు చేశాడు.


~chunchu87 +91 99633 94855
నా ప్రియమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు, శ్రేయోభిలాషులకు, తెలియజేయునది ఏమనగా, 6 నెలలు కష్టపడ్డ వారి ధాన్యాన్ని ఇంతవరకు కొనుగోలు చేయడం లేదు, ప్రతిపక్ష పార్టీ వాళ్లు ఎగతాళి చేయడం జరుగుతుంది, ఇదేనా మీ ప్రభుత్వం అనడం జరుగుతుంది, రైతులు పండించిన పంటను దళారులకు అమ్మడం జరుగుతుంది,ప్రభుత్వానికి మన కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు రైతుల గోస చెప్పడం నా యొక్క విజ్ఞప్తి. జై కాంగ్రెస్ జై జై కాంగ్రెస్.

కొనుగోలుపై పోస్టు చేసిన మెసేజ్

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

జిల్లా వైద్యాధికారి పల్వన్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్

సిద్దిపేట, నవంబర్ 4 : ల్యాబ్ టెక్నీషియన్లు ప్రతిరోజూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు డాక్టర్ల సూచనల మేరకు అన్ని రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు టీహబుకు పంపాలని, టీ హబ్‌తో అనుసంధానమై పరీక్ష ఫలితాలను ప్రజలకు చేరవేసేలా బాధ్యతలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ సూచించారు. సిద్దిపేట జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమయ పాలన పాటించాలని లేదంటే క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట అధికారులు డాక్టర్ శ్రీకాంత్, ఫైలేరియా హెచ్‌ఈవవో కాల్వ చక్రధర్, మూడు డివిజన్ల సబ్ యూనిట్ అధికారులు కొండయ్య, ప్రాథమిక, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా దవాఖాన, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

ఎల్లమ్మ చెరువులో చేపపిల్లలను వదులుతున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 4 : మత్స్య సంపద పెంపుతో ఆర్థికంగా మత్స్య కారులు ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మచెరువులో సోమవారం లక్షాయాభైవేల చేపపిల్లలను వదిలారు. మత్స్యకారుల జీవనోపాధిని పెంచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని చైర్‌పర్సన్ అన్నారు. కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ పున్న లావణ్య సది, మత్స్య సహకార అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, జిల్లా మత్స్యకార్మిక సహకార సంఘం డైరెక్టర్ పెండ్యాల అయిలయ్య, హుస్నాబాద్ సంఘం అధ్యక్షుడు పొన్నాల మల్లయ్య, ఉపాధ్యక్షుడు బాలయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మొకాళ్లపై నిరసన

మొకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చేర్యాల, నవంబర్ 4 : మండలంలోని శభాష్‌గూడెం నుంచి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని సాల్వాపూర్ వరకు నిలిపివేసిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం రోడ్డుపై మొకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ సభ్యుడు కనకయ్య మాట్లాడుతూ శభాష్‌గూడెం నుంచి సాల్వాపూర్ వరకు కొనసాగుతున్న రోడ్డు పనులు గత 4 నెలల క్రితం మధ్యాంతరంగా నిలిపివేయడం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని రోడ్డు మరమ్మతులు పనులు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి డి.రమేశ్, నాయకులు దాసరి కనకయ్య, బాలు, ప్రకాశం, సంపత్, కొమురయ్య, నాగపురి కిరణ్, సురేశ్, నాగేశ్, మహేశ్, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 4 : మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను తోటి స్నేహితులతో పంచుకున్నారు. గురువులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల తమ ఆటపాటలతో సందడి చేశారు.

ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలి

రైతుకు సూచనలు చేస్తున్న సీఐ శ్రీను

కొమురవెల్లి, నవంబర్ 4 : రోడ్లపై ధాన్యం కుప్పలను రైతులు పోయడం వల్ల వాటిని గమనించకుండా వచ్చిన పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని సీఐ శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. మర్రిముచ్చాల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కొందరు రైతులు రోడ్డుపై ధాన్యం పోయడంతో విషయం తెలుసుకున్న సీఐ సోమవారం సదరు ప్రదేశానికి వెళ్లి ధాన్యం పోయడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు, నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు.

నగేశ్‌కు జాతీయ రాధాకృష్ణ అవార్డు

అవార్డు అందుకుంటున్న నగేశ్

తొగుట,నవంబర్ 4 : తొగుట మండలం ప్రాథమిక కోన్నత పాఠశాల చందాపూర్‌లో పనిచేస్తున్న హిందీ పండిట్ దూడం నగేశ్ సోమవారం హైదరాబాద్‌లో జాతీయ రాధాకృష్ణ అవార్డు అందుకున్నారు. తెలంగాణ నుంచి 22 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. అందులో నగేశ్ ఎన్నిక కావడం చాలా సంతోషకారమని ప్ర ధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మందుబాబులకు జరిమానా

గజ్వేల్, నవంబర్ 4 : మద్యం సేవించి వాహనాలు నడిపిన 51మందికి రూ.33వేల జరిమానాను సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ప్రియాంక విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్ పట్టణ శివారులోని ఆయా ప్రాంతాల్లో డంకన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు తెలిపారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట టౌన్, నవంబర్ 4 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం సోమవారం జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. ట్రాఫిక్ సర్కిల్ పరిధిలోని నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాలతో పాటుగా రాజీవ్ రహదారిపై పోలీస్ సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 24 మంది మందు బాబులు పట్టుబడ్డారు. ఈ మేరకు సిద్దిపేట స్పెషల్ సెంకడ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరిచామని, విచారణ జరిపిన న్యాయమూర్తి వాహనదారులకు రూ. 41 వేల జరిమానా విధించారు.

పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలు

గజ్వేల్, నవంబర్ 4: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఊర చెరువు సమీపంలోని కోళ్ల ఫారం వద్ద పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఏడుగురిని గాయపరిచింది. ప్రజ్ఞాపూర్‌కు చెందిన మంజులకు తీవ్రంగా గాయమవడంతో గజ్వేల్ దవాఖానలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించారు. ఆరేండ్ల యోహన్‌కు గాయమవడంతో గజ్వేల్ దవాఖానలో చికిత్స అందించారు. మరో ఐదుగురికి స్వల్పంగా గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు.

ముందస్తు అరెస్టు

అక్కన్నపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

గజ్వేల్ స్టేషన్‌లో మండల మాజీ సర్పంచ్‌లు

హుస్నాబాద్‌రూరల్: పోలీసులు అరెస్ట్ చేసిన పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు

తమ పదవీ కాలంలో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ సోమవారం నిరసన తెలిపేందుకు హైదరాబాద్ వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఇంకా ఎన్ని రోజులు అధికారులతో ఇన్‌చార్జిల పాలన కొనసాగిస్తారాని ప్రశ్నించారు. అప్రజాస్వామికమని విమర్శించారు.

- సిద్దిపేట జిల్లా నెట్ వర్క్, నవంబర్ 4

చిన్నకోడూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కామిని శ్రీనివాస్

బెజ్జంకి: బెజ్జంకిలో మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు

మిరుదొడ్డి పోలీసు స్టేషన్‌లో..

సిద్దిపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ..

గ్రూప్ 3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 4: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్3 పరీక్షకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రూప్ 3 పరీక్ష నిర్వహనకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్ , డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ వి.పి రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టీజీపీఎస్ సీ గ్రూప్ 3 పరీక్ష నిర్వహణ గురించి క్లుప్తంగా వివరించారు. నవంబరు 16,17, 18 ఎలాంటి కరెంట్ కోతలు లేకుండా చూసుకోవాలని విద్యుత్ అధికారులకు, ఆర్టీసీ అధికారులు స్పెషల్ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. పోలీస్ అధికారులు పరీక్ష కేంద్రం చుట్టూ 144 సెక్షన్ అమలు, చుట్టూ బందోబస్తు అందించాలని పోలీస్ నోడల్ ఆఫీసర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్ కి తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మండల విద్యార్థుల ఎంపిక

కొండపాక, నవంబర్ 4 : మండల పరిధిలోని సిరిసినగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. 8వ తరగతికి చెందిన మనీషా, 9వ తరగతికి చెందిన దీక్షిత సోమవారం సిద్దిపేటలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రెవెన్యూ డివిజన్ సాధనకు ఆందోళనలు ముమ్మరం

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రామగల్ల పరమేశ్వర్

చేర్యాల, నవంబర్ 4 : అన్ని అర్హతలున్నా చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ఆందోళనలు ముమ్మరం చేస్తామని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. సోమవారం పట్టణంలో జేఏసీ కార్యాలయాన్ని ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు ప్రారంభించారు. అనంతరం పరమేశ్వర్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈ నెల రెండో వారంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు కే.మహేశ్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రాలు అందజేస్తామన్నారు.ఈ నెల 30న వెయ్యి మందితో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంకల్ప దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జేఏసీ ప్రతినిధులు పుర్మ ఆగంరెడ్డి, కామిడీ జీవన్ రెడ్డి, తోకల ఉమారాణి, అంకుగారి శశిధర్ రెడ్డి, అందె అశోక్, అందె బీరయ్య, మల్లిగారి యాదయ్య, కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంపై మంత్రిదృష్టికి తీసుకువెళ్తా..

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 4 : భయం.. భయం ఆరహదారిపై అంధకారంలో ప్రయాణం ఇబ్బందులపై సోమవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై ఆ ప్రాంత వార్డు కౌన్సిలర్ కొంకట నళినిదేవి రవీందర్ స్పందించారు. కేజీవీబీతోపాటు నూతనంగా ఆ ప్రాంతంలో ఇండ్లు నిర్మించుకున్నారని, ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. మున్సిపల్‌లో సరైన బడ్జెట్‌లేకపోవడంతో నిధులను మంజూరు చేసి అంధకారం తొలిగించాలని బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు నళినిదేవి తెలిపారు.

పేకటారాయుళ్ల అరెస్టు

బెజ్జంకి, నవంబర్ 4: మండలంలోని కల్లెపల్లిలోని పేకట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. రూ.3690 నగదు, 6 సెల్‌ఫోన్లు లభించగా, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

మహా సభల సమావేశంలో మాట్లాడుతున్న గోపాల స్వామి

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), నవంబర్ 4 : బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదల పొట్ట కొడుతూ దేశంలోని బడా బాబుల కొమ్ము కాస్తున్నాయని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల స్వామి అన్నారు. సోమవారం అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని రుద్రారంలో సీపీఎం పార్టీ మండల 6వ మహా సభలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రవి కుమార్, క్రాంతి, బాల పోచయ్య, స్వామి, నాగరాజు, నాంపల్లి పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేట కమాన్, నవంబర్ 4 : సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలో జిల్లాకు ఎక్కువ పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని సిద్దిపేట జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సౌందర్య అన్నారు. అండర్ 14 – 17 బాల బాలికల విభాగంలో సోమవారం జరిగిన ఎంపికలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి సుమారుగా 650 మంది పాల్గొన్నారు. పరుగు పందెం, షాట్ పుట్, డిస్కస్, జావలిన్ త్రో, లాంగ్ జంప్, హై జంప్ అంశాలలో పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు చేశారు. అండర్ – 14 బాల బాలికలకు ఈ నెల 15 నుంచి 18 వరకు అండర్ – 17 బాలబాలికలకు రంగారెడ్డి జిల్లాలో డిగ్రీ కాలేజ్ జరుగుతాయన్నారు. మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు రామేశ్వర్ రెడ్డి, సుజాత, భిక్షపతి, అశోక్, ఉప్పలయ్య, వెంకటస్వామి, సువర్ణలత, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, లీలా, ఆనంద్, నిషాక్ గౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టం అమలు కావాలి

సిద్దిపేట అర్బన్, నవంబర్ 4 : సిద్దిపేట పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో అబ్ స్టేట్రిక్స్ అండ్ గైయినకాలజీ (ఎస్ఓజీఎస్) కార్యక్రమ ప్రారంభోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రముఖ గైయినకాలజిస్టులు ఫెడరేషన్ ఆఫ్ అబ్ స్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ ఆఫ్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ శాంతకుమారి, ప్రముఖ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ అండ్ ఇంటర్నేషనల్ టీచర్ డాక్టర్ మమత దీన్ దయాల్, వరంగల్ గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతకుమారి సిద్దిపేట జిల్లా గైయినకాలజిస్టులకు పలు సూచనలు చేశారు. డాక్టర్ మమతాదీన్ దయాల్ స్త్రీలకు గర్భస్థ సమయంలో ఎమర్జెన్సీ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ గురించి అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ చట్టం పూర్తిగా అమలు కావాలని ఆడ శిశువు సంరక్షణ గురించి పలు సూచనలు చేశారు. అధ్యక్షుడు డా.అశోక్ కుమార్ మాట్లాడారు. అనంతరం ఐఎంఏ హాల్‌లో మొక్కలు నాటారు. ఎస్ఓజీఎస్ పాలకమండలని సత్కరించారు.

ఆర్థిక సాయం

వైద్య విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేసిన దాతలు

సిద్దిపేట టౌన్, నవంబర్ 4 : పేద వైద్యవిద్యార్థినుల చదువులకు మేమున్నామంటూ దాతలు ముందుకు వచ్చి సోమవారం ఆర్థికసాయం అందించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన నలుగురు పేద కుటుంబానికి చెందిన విద్యార్థినీలు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వారు ఫీజులు కట్టేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న డాక్టర్ వల్లకోటి దేవేందర్ ,వడ్డేపల్లి చిరంజీవులు రూ. 40.116 వేలు అందజేశారు. డాక్టర్ రజనీష్, నాగమణి, పునర్వసు, విమలు పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, నవంబర్ 4 : మండలంలోని శభాష్‌గూడెం గ్రామాని చెందిన సంకోజు రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ముందుకు వచ్చి రూ.6 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం మృతుడి కుటుంబ సభ్యులు అందజేశారు.

జాతీయ స్థాయి జట్టుకు భవిష్యరెడ్డి ఎంపిక

కొమురవెల్లి, నవంబర్ 4 : మండలంలోని మర్రిముచ్చాల గ్రామానికి చెందిన నక్కల నరేశ్ రెడ్డి కుమార్తె భవిష్యరెడ్డి జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. సెప్టెంబర్‌లో తమిళనాడు రాష్ట్రంలోని కోటగిరిలో సీఐఎస్‌సీఈ నేషనల్ వాలీబాల్ టోర్నీలో తెలంగాణ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించిన భవిష్యరెడ్డి అత్యుత్తమ ప్రతిభ చూపించడంతో జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో ఈ నెల 6 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని భారెల్లిలో నిర్వహించే 68వ జాతీయ పాఠశాలల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వాలీబాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి భవిష్యరెడ్డి పాల్గొననున్నది.

దేవులపల్లి రమేశ్‌కు జాతీయ సాహిత్య పురస్కారం

నంగునూరు, నవంబర్ 4 : నంగునూరు మండల కేంద్రానికి చెందిన దేవులపల్లి రమేశ్‌కు జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరిగపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి జాతీయ పురస్కారాలు అందజేశారు. ఈ మేరకు సోమవారం ఎంజేపీ గురుకుల పాఠశాల తెలుగు అతిథి ఉపాధ్యాయుడు దేవులపల్లి రమేశ్‌కు సాహిత్య సేవలో పురస్కారం లభించింది.

గణిత శాస్త్రజ్ఞురాలికి నివాళి

అక్కన్నపేట, నవంబర్ 4 : మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత శాస్త్రజ్ఞురాలు శకుంతల జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా సదర్ పండుగ

సిద్దిపేట, నవంబర్ 4 : సిద్దిపేటలో సోమవారం సదర్ సంబురాలు ఘనంగా జరిగాయి. సిద్దిపేట యాదవ సంఘంతో పాటు కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లంయాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు చౌరస్తాలో సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతులు ఆటపాటలతో ఆకట్టుకున్నాయి. యాదవులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

బాలసాహిత్య పీఠం అవార్డు పొందిన విద్యార్థి

కొండపాక, నవంబర్ 4 : మండల కేంద్రం కొండపాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బాలసాహిత్య పీఠం అవార్డుకు ఎంపికైంది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మాజీరాజు బాల సాహిత్య పీఠం వారు నిర్వహించిన కథల పోటీల్లో 9వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ అవార్డుకు ఎంపిక కాగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో నగదు పురస్కారం పొందారు. అధ్యాపక బృందం అభినందించారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్, నవంబర్ 4: పశువుల్లో గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్, ముఖ్య పర్యవేక్షణాధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొడకండ్లలో గాలికుంటు నివారణ టీకా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వైద్యులు డాక్టర్ రమేశ్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో ఉద్యోగులు

గజ్వేల్, నవంబర్ 4 : గజ్వేల్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వీవీఎల్. చంద్రకళను సోమవారం మర్యాదపూర్వకంగా టీఎన్జీవో గజ్వేల్ యూనిట్ సంఘం బాధ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు బి. లింగం, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాగభూషణం, ప్రవీణ్, నరేశ్‌చారి, సలాఉద్దీన్ పాల్గొన్నారు.